క్లుప్తంగా

టీడీపీ అధినేతను కలిసిన ఆదోని ఎమ్మెల్యే



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడితో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును గురువారం ఆదోని ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే పార్థసారథి కలిశారు. తాడేపల్లిగూండెంలోని చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదే సందర్భంలో ఎన్నికల సరళి గురించి వివరించినట్లు పార్థసారథి చెప్పారు. ఆదోని అభివృద్ధికి సహకరించాలని కోరినట్లు ఆయన వెల్లడించారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు



పూజలందుకుంటున్న బసవేశ్వర స్వామి

కోసిగి: స్థానిక బసవన్న కొండపై వెలసిన బసవేశ్వర స్వామికి గురువారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజాము నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండి కవచ అలంకరణ, ఆకుపూజలు గావించి మహా మంగళ హారతులు పట్టి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేళాలు సమర్పించి పూజలు చేశారు. భక్తి, భజన పాటలు ఆలపించారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో శనీశ్వర జయంతి



శనీశ్వరస్వామికి మహామంగళహారతి ఇస్తున్న గరుడాద్రి దత్తాత్రేయశర్మ

ఆదోని అర్బన్: శనీశ్వర జయంతి సందర్భంగా గురువారం స్థానిక మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు శనీశ్వర స్వామికి తైలాభిషేకం, శాంతిహోమం నిర్వహించారు. అంతేగాకుండా ఈ ఏడాది శనిదోషంతో బాధలు, కష్టాలు, అనారోగ్యం తదితర సమస్యలను అనుభవిస్తున్న కర్కాటక, సింహ, తుల, మకర, కుంభ, మీనరాశుల వారికి శాంతి హోమం నిర్వహించారు. ముందుగా మంగరాయ ఆంజనేయస్వామికి ఫల పంచామృతాభిషేకం, పూలు, వెండి అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం శనీశ్వరస్వామికి దోష పరిహార పూజలు చేశారు. పండితుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై ఫిర్యాదు

ఆదోని అర్బన్: తనపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం టూటౌన్ సీఐ గోపీకి రిపోర్టర్ ప్రకాష్ (సాక్షి కాదు) ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాల క్రితం పట్టణంలోని ఎంఎం కాలనీలో గ్రంథాలయం ఉండేదని, ఆ గ్రంథాలయం మూసివేయడంతో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పత్రికలో ప్రచురించడం జరిగిందన్నారు. దీన్ని జీర్ణించుకోలేక ఎంఎం కాలనీకి చెందిన కృష్ణ, శ్రీకాంత్ అలియాస్ బాజీ తనపై బుధవారం రాత్రి దాడి చేశారని తెలిపారు. కృష్ణ ఆ గ్రంథాలయం భవనంలో గొర్రెలు, మేకలు ఉంచేవారని, దాన్ని పత్రికలో రాసినందుకు తనపై దాడి చేశారన్నారు. గాయపడిన తాను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు చెప్పారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మారెమ్మ ఆలయంలో చోరీ

కౌతాళం: మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో వెలసిన మారెమ్మ దేవాలయంలో గురువారం తెల్లవారుజామున దొంగతనం జరిగింది. మారెమ్మ అవ్వకు భక్తులు సమర్పించిన బంగారు ఆభరణాలను దుండగులు దొంగలించుకుని వెళ్లారు. మంగళసూత్రాలు, పూర్ణిలను దొంగలించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందన్నారు. తెల్లవారితే అమావాస్య ఉండడం ఇదే రోజు అమ్మవారి బంగారు ఆభరణాలు దొంగతనం జరగడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు పూర్తి విచారణ జరిపి దొంగలను పట్టుకుని బంగారు ఆభరణాలను రికవరీ చేయాలని వారు కోరుతున్నారు.



పూలచింతలో పత్తి విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు



పొలంలో గుంటక పాస్తున్న రైతన్న



ట్రాక్టర్‌తో జీలుగ విత్తనాలు విత్తుతున్న రైతులు

కాడెద్దుల సవ్వడి.. కర్షకుల సందడి

నందవరం: తొలకరి చినుకలతో పుడమితల్లి పులకరించిన వేళ. ఓ వైపు హలాల సవ్వడి.. మరో వైపు కర్షకుల సందడి మొదలైంది. ఊరూరా పొలం పనుల్లో రైతులు.. కలుపులు, విత్తులు, గుంటికలు, తదితర వ్యవసాయ పనుల్లో కూలీలు బిజీబిజీగా కనిపిస్తున్నారు. నిన్నటి వరకు బోసిపోయిన పొలాలు కాడెద్దులు, కర్షకులతో దర్శనమిస్తున్నాయి. ముందస్తు పత్తి విత్తనంతో పొలాలన్నీ సైద్యపు సవ్వడితో మురిసిపోతున్నాయి. నందవరం మండల పరిధిలోని నదితీర గ్రామాలు నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి, బోర్లు, బోరు బావుల గ్రామాలు కనకవీడు, ఇబ్రహీంపురం, మాచాపురం, పూలచింత, నందవరం, టి.సోమల గూడూరు, పోనకలదిన్నె గ్రామాల్లో నెలకొన్న పొలాల.. హలాల.. కూలీల సందడి దృశ్యమాలిక ఇదిగో.



ఆర్బీకేలో వేరుశనగ విత్తనాలు అందిస్తున్న వీఏఏ శేఖర్



జుమ్మాలదిన్నె వద్ద పొలంలో దెంతె పడుతున్న రైతులు

ముమ్మరంగా ఖరీఫ్ సాగు

కోసిగి: మండలంలో ఇటీవల విస్తారంగా వర్షాలు కురువడంతో అన్నదాతలు ముమ్మరంగా ఖరీఫ్ సాగులో నిమగ్నమయ్యారు. మండలంలో అత్యధికంగా పత్తి, వేరుశెనగ, మిరప, ఉల్లి, కంది పంటలు సాగు చేస్తారు. రైతన్నలు పొలాల్లో నాట్లు వేసుకోవడం, దెంతిక పట్టడం పనుల్లో బిజీగా ఉన్నారు. ఇటీవల కోసిగి మండలానికి 210 క్వింటాళ్ల వేరుశెనగ సబ్సిడీ విత్తనాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు వివిధ గ్రామాల్లోని ఆర్బీకేలకు 180 క్వింటాళ్లు మంజూరైనట్లు వ్యవసాయ శాఖ ఏఓ రాజు తెలిపారు. ఆర్బీకేల ద్వారా రైతులకు విత్తనాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. రైతుల వినతి మేరకు మరిన్ని క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మరో విడత విత్తనాలు వచ్చిన వెంటనే రైతులకు అందించే ప్రక్రియ చేపడుతామన్నారు.

కొనసాగుతున్న విజయోత్సవాలు



ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వై.ప్రదీప్ రెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

మంత్రాలయం: మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి నాల్గవ సారి గెలుపొందడంతో రాంపురం గ్రామంలో విజయోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం పెద్దకడబూరు, మంత్రాలయం, కోసిగి, కౌతాళం మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డిని కలిసి శాలువా, పూలమాలలు వేసి ఘన సన్మానం చేపట్టి అభినందనలు తెలిపారు. నాల్గవ సారి ఎమ్మెల్యేగా గెలుపునకు కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు, అభిమానులు, ఓట్లు వేసి గెలిపించిన ప్రజలందరికీ వారు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల రుణం తీర్చేకోలేనిదన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావుకు నివాళి

ఆదోని రూరల్: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, సామ్యవాది, తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రత్యేక పాత్ర పోషించిన కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు 110వ జయంతి కార్యక్రమాన్ని గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్ బాబు, సీనియర్ నాయకులు కె.లక్ష్మిరెడ్డి, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కల్లు బావిరాజు మాట్లాడుతూ.. చండ్ర రాజేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీకి ఎన్నో సేవలు అందించారన్నారు. పార్టీ నిర్మాణం కోసం యావదాస్తిని ఉపయోగించారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఆయన అందించిన సేవలను గుర్తుంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు హుసేని, యల్లప్ప, మెకానిక్ వలి, సూరి తదితరులు పాల్గొన్నారు.



చండ్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



కోర్టు ఆవరణలో మొక్కను నాటుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజారావు, న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: మొక్కలను నాటి పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.గురురాజారావు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా కోర్టు ఆవరణలో గురువారం అసోసియేషన్ కార్యదర్శి రఘురాం, న్యాయవాదులతో కలిసి మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఇందుకు మొక్కలు నాటాలని కోరారు. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు జయరాజ్, మహేశ్వరి, సురేష్, మారుతి, రంగనాథ్, ఎస్ఐ బాబు, కుమార్, నర్సిరెడ్డి, బాష, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్లను రద్దుచేయాలి

ఆదోని సెంట్రల్: సార్వత్రిక ఎన్నికల విధులకు హాజరు కాలేకపోయిన ఉపాధ్యాయులపై ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య పట్టణ అధ్యక్షుడు అనీల్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి కోటన్న డిమాండ్ చేశారు. పట్టణ పురపాలక ఉపాధ్యాయుల సమావేశం పట్టణ శాఖ కార్యదర్శి బడుగు బసవరాజు అధ్యక్షతన గురువారం జరిగింది. వారు మాట్లాడుతూ.. ఎలక్షన్‌కు సంబంధించిన ఉత్తర్వులు ఎన్నికలకు నెల రోజుల ముందు ఇవ్వడంతో అనారోగ్య పరిస్థితులు, దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారు, శిక్షణా కార్యక్రమాలకు, పోలింగ్ విధులకు హాజరుకాలేక పోయారన్నారు. అలాంటి వారిపై సస్పెన్షన్ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. మహిళా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని మనవతా దృక్పథంతో సస్పెన్షన్లను రద్దుచేయాలని కోరారు. ఎన్నికల విధులలో పాల్గొన్న వారికి రాష్ట్రం మొత్తం ఒకే విధంగా పారితోషకం అందించాలని కోరారు. ఏపీ ఎంటీఎస్ నాయకులు అలీం సిద్ధిఖీ, రామయ్య, ఒబేదుర్ రెహ్మాన్, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎంటీఎస్ పట్టణ అధ్యక్షుడు అనిల్‌కుమార్

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న గ్రంథాలయ అధికారిణి సుజాత, రమేష్

ఆదోని అర్బన్: ఆదోనిలోని శాఖా గ్రంథాలయంలో మే 1వ తేదీ నుంచి ప్రారంభమై 37 రోజులపాటు జరిగిన సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలను గ్రంథాలయ అధికారిణి సుజాత ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రమేష్ హాజరై మాట్లాడారు. సమ్మర్ క్యాంపు ద్వారా విద్యార్థులు వివిధ అంశాలపై విజ్ఞానాన్ని సంపాదించుకున్నారన్నారు. ప్రతిరోజూ పుస్తకాలను చదవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ చూడడం ద్వారా పుస్తక పఠనానికి దూరమైపోతారన్నారు. సెల్‌ఫోన్లు చూడడం ద్వారా మానసికంగా ఆరోగ్యం, కళ్లు దెబ్బతింటాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పుస్తక పఠనంపై ప్రోత్సహించాలన్నారు. దినపత్రికలు చదివడం ద్వారా ముఖ్యమైన సమాచారం తెలుస్తుందని వివరించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో రిటైర్డ్ ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు యోగా, మెడిటేషన్, బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, డ్రాయింగ్ క్రాఫ్ట్, కల్చరల్ యాక్టివిటీస్, ఆటలు, ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నేర్పించడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రమేష్ చేతుల మీదుగా పరీక్షా ప్యాడ్స్, పెన్నులు, బాక్సులు బహుమతులుగా అందించారు. గ్రంథాలయ సిబ్బంది, రికార్డు అసిస్టెంట్ ఎం.దేవేంద్ర, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌బాబు

గోనెగండ్ల: దళిత సమస్యల పరిష్కారంపై పాలక వర్గం దృష్టి పెట్టి పరిష్కారానికి చొరవ చూపాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గోనెగండ్లలోని బస్టాండ్ ఆవరణలో మండల కమిటీ సమావేశం ఆ సమితి మండలాధ్యక్షుడు మారేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఆనంద్‌బాబు, కరుణాకర్ మాట్లాడుతూ ముందుగా రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు. డప్పు కళాకారుల పెన్షన్‌ను పెంచాలి. శ్మశానంలో గుంతలు తీసేవారిని, తంబూర కళాకారులను వృత్తిదారులుగా గుర్తించాలని, చర్మకారులకు కిట్లు పంపిణీ చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఆ సంఘం నాయకులు దేవదాస్, రంగన్న, సంటెన్న, దస్తగిరి, పెద్ద కర్రెన్న, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదోని అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆదోని ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన బీజేపీ నాయకుడు డాక్టర్ పార్థసారథి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆదోని ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్ కోరారు. ఆయన గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆదోని ఎమ్మెల్యేగా గెలిచిన పార్థసారథికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అకాంక్షలకు అనుగుణంగా ఎమ్మెల్యే పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పట్టణంలో రోడ్ల విస్తరణ, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో ఆ పార్టీ కూటమి అధికారంలో ఉండడంతో తగినన్ని నిధులు రాబట్టి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇండియా కూటమిలో భాగంగా సీపీఐ, సీపీఎం పార్టీలను కలుపుకుని ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సీపీఐ నాయకులు అజయ్‌బాబు, సుదర్శన్, సీపీఎం నాయకులు తిప్పన్న, కాంగ్రెస్ నాయకులు దిలీప్‌దోకా, సాయినాథ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంలో పవన్‌దే కీలకపాత్ర

మంత్రాలయం: రాష్ట్రంలో కూటమి విజయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రధాన పాత్ర పోషించారని ఆ పార్టీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వాల్మీకి లక్ష్మన్న అన్నారు. ఆయన గురువారం పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి పవన్‌కల్యాణ్‌కు శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్ జీరో స్థాయి నుంచి మొదలుపెట్టి ఇవాళ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కింగ్ మేకర్‌గా అవతరించాడన్నారు. రాష్ట్రంలో జనసేన పార్టీకి కేటాయించిన అన్ని స్థానాల్లో గెలుపొందడంతో పాటు కూటమి అభ్యర్థుల గెలుపునకు కూడా కృషి చేశారన్నారు. కూటమి అఖండ గెలుపునకు పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ప్రధాన కారణమని స్పష్టం చేశారు. గెలుపునకు కృషిన జనసేన కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలు బీవీ రవిచంద్ర, ప్రకాష్, రాజశేఖర్, ఖాజా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన మంత్రాలయం ఇన్‌చార్జ్ వాల్మీకి లక్ష్మన్న

యువ రైతు ఆత్మహత్య



వడ్డె బజారి (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బోడబండ గ్రామానికి చెందిన యువ రైతు వడ్డె బజారి (32) అప్పుల బాధతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. బోడబండ గ్రామానికి చెందిన వడ్డె బజారికి భార్య సరస్వతి, కుమార్తెలు రేణుక, అనుపమ, కుమారుడు మహేష్ ఉన్నారు. సొంతంగా ఏడెకరాల పొలం ఉండగా మరో మూడెకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. అప్పులు చేసి పొలంలో రెండు బోర్లు వేయించి మిరప పంటను సాగుచేశాడు. పంట నష్టం రావడంతో అప్పులే మిగిలాయి. అప్పులు రూ.10 లక్షలకు చేరాయి. తిరిగి చెల్లించాలని ఒత్తిడి ఎక్కువైంది. ఈ క్రమంలో భార్య పిల్లలతో కలిసి పుట్టినిల్లు కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కరుగోడు గ్రామానికి వెళ్లింది. రెండు రోజుల క్రితం భార్య దగ్గరకు వెళ్లి మాట్లాడి బయటకు వచ్చి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి గురువారం స్వగ్రామం బోడబండకు తీసుకొచ్చారు. ఇంటి పెద్ద అప్పుల బాధతో మృతి చెందడంతో కుటుంబ రోడ్డున పడింది. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

11న వాహనాల వేలం

పత్తికొండ రూరల్ : అక్రమ మద్యం, నాటుసారా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాల బహిరంగ వేలం ఈ నెల 11వ తేదీన పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయంలో నిర్వహిస్తామని సెబ్ సీఐ స్వర్ణలత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ బహిరంగ వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వేలంలో వాహనాలు దక్కించుకోని వారికి డిపాజిట్ సొమ్ము తిరిగి చెల్లిస్తామని చెప్పారు.

కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



బాపురం చంద్రశేఖర్‌రెడ్డి

పెద్దకడబూరు: ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి బాపురం చంద్రశేఖర్‌రెడ్డి గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. రాజీనామా లేఖను ఫ్యాక్స్ ద్వారా ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. తనపై నమ్మకముంచి పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి రుణపడి ఉంటానన్నారు. ఎన్నికలలో ప్రజల ఇచ్చిన తీర్పును స్వీకరిస్తానన్నారు. ఎన్ని బాధలు, ఇబ్బందులు కలిగినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వెంటే ఉండి పార్టీకోసం పోరాడతానని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకుండా పార్టీ కోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. నాలుగోసారి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని గెలిపించినందుకు మంత్రాలయం నియోజకవర్గం ప్రజలకు, పెద్దకడబూరు మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది. గురువారం అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇలవేల్పు స్వామి వారిని దర్శించుకోవడానికి వేలాదిగా తరలి వచ్చారు. బుధవారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చి అమావాస్య వేడుకల్లో పాల్గొనడంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. స్వామి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. భక్తులను విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపీ మార్గాల్లో దర్శనానికి పంపారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్‌లో కూడా భక్తులు గంటకుపైగా వేచిఉండి స్వామివారి దర్శనం చేసుకున్నారు. పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని కంట్రోల్ చేయడంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది సహకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు. కౌతాళం పోలీసులు గట్టి బందబస్తు ఏర్పాటు చేశారు.





పూజలందుకుంటున్న ఈరన్న స్వామి మూలవిరాట్, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో

ఉరుకుందకు ఐదు కిలోమీటర్ల దూరంలో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజనేయ స్వామిని దర్శనానికి తరలిరావడంతో ఈ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి అమావాస్య సందర్భంగా భక్తులు అధికంగా తరలివచ్చారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో ఆ రాష్ట్ర భక్తులు కూడా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్గాల్లో ఒకటైన, మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. గురువారం స్వామి వారం కావడంతో పాటు అమావాస్య కలిసిరావడంతో బుధవారం సాయంత్రం నుంచే భక్తులు తరలివచ్చారు. కొంతమంది భక్తులు పిండి వంటలు వండి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామి దర్శనానికి తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. అంతకుముందు తెల్లవారుజామున 5 గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. దర్గాలో నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.



ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు



దర్గాలో భక్తుల సందడి